సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 11 । ఏప్రిల్ । 2024

I



గండికోటను అభివృద్ధి చేయాలి

గండికోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని నగరపాలక కమిషనర్ ప్రవీణ్ చంద్ అన్నారు. బుధవారం ఆర్కియాలజీ అధికారులతో కలిసి పర్యటించారు. -IIలో



ముస్లింల ఓట్లను చీల్చేందుకు కుట్ర

ప్రస్తుత ఎన్నికల్లో ముస్లింల ఓట్లను చీల్చేందుకు కొందరు ముస్లిం నేతలే కుట్ర పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ జొహెచ్ ఇలియాస్ ఆరోపించారు. -IIలో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.2 /24.6

జిల్లాలో బుధవారం 24.6 - 39.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 10.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు



పులివెందుల : జిల్లాలోని ముస్లింలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఒక ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ మనుషుల్లో మానవీయ విలువలను, పరస్పర ప్రేమానురాగాలను పెంపొందిస్తుందన్నారు. సమాజంలో సమానత్వం, సోదరభావాన్ని తెలియజేస్తుందన్నారు. రంజాన్ పండుగ ముఖ్యంగా దాన గుణాన్ని నేర్పుతుందన్నారు. ఈ పండుగను జిల్లాలోని ముస్లింలు ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

టోఫెల్ పరీక్ష తనిఖీ



టోఫెల్ పరీక్షను తనిఖీ చేస్తున్న జిల్లా నోడల్ అధికారి ప్రసాద్ రెడ్డి

సిద్దవటం: మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం టోఫెల్ (టెస్టు ఆఫ్ ఇంగ్లీష్ ఆజ్ ఎ ఫారిన్ లాంగ్వేజ్) పరీక్షను జిల్లా నోడల్ అధికారి ప్రసాద్‌రెడ్డి , ఎంఈఓ-2 అరుణ తనిఖీ చేశారు. సిద్దవటం మండలంలోని ఎస్. రాజంపేట ప్రాథమిక పాఠశాల, సిద్దవటం జెడ్పీ హైస్కూల్‌లో, సిద్దవటం దిగువపేట మెయిన్ స్కూల్‌ల్లో 3,4,5 తరగతుల విద్యార్థులకు టోఫెల్ పరీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3వ తరగతి నుంచి 9వ తేదీ వరకు ఇంగ్లీష్ భాష ప్రావీణ్యాన్ని పరీక్షించడగానికి ప్రతిష్టాత్మక మైన టోఫెల్ పరీక్షను ఈటీఎస్ అనుసంధానంతో ఈనెల 10 , 12వ తేదీలలో నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 121 పాఠశాలల్లో ఈ టోఫెల్ ప్రైమరీ పేరుతో 3,4,5 తరగతుల విద్యార్థులకు పరీక్షను నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు.

పాఠశాల తనిఖీ

కడప ఎడ్యుకేషన్: కడప నగరం గాండ్ల వీధిలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలను సమగ్ర శిక్ష జీసీడీఓ విజయలక్ష్మి, అల్టర్నేట్ స్కూల్స్ కోఆర్డినేటర్ చల్లా విశ్వనాథరెడ్డి బుధవారం పరిశీలించారు. విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టోఫెల్ ప్రైమరీ రీడింగ్ అండ్ లిజినింగ్ రెడినెస్ టెస్టు -24ను పరీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల రీడింగ్ స్కిల్స్, లిజనింగ్ స్కిల్స్‌ను ఉపాధ్యాయులు మెరుగు పరచాలని సూచించారు.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

బద్వేలు అర్బన్ : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో బుధవారం జిల్లా ఎస్పీ సిద్దార్థ్‌కౌశల్ ఆదేశాల మేరకు కేంద్ర సాయుధ బలగాలతో అర్బన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాలైన సుమిత్రానగర్, శివానగర్, కోటవీధి, చెన్నంపల్లె, బోయిళ్ళవారిపల్లె, చిన్నకేశంపల్లె, విద్యానగర్, ఆంజనేయనగర్ తదితర ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడం, ప్రజల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టి వారు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు భరోసా కల్పించడం కోసం ఈ కవాతు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

వైభవం.. సిరిమాను ఉత్సవం



భక్తుల కోలాహలం నడుమ సిరిమానోత్సవం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని వద్దిరాల గ్రామంలో సుంకులమ్మ జాతర సందర్భంగా బుధవారం సిరిమాను ఉత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. జమ్మలమడుగు డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ హనుమంత్ ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

సుంకులమ్మకు జాతరకు ఎంపీ హాజరు

వద్దిరాలలో జరుగుతున్న సుంకులమ్మ జాతరకు బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్‌లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించి అమ్మవారి చిత్ర పటాన్ని అందజేశారు.

ఈద్ ముబారక్ హో!



దైవం కారుణ్యం చూపిస్తాదని....జన్మకు సాఫల్యత లభిస్తుందని... సాటి మనిషిని ఆదుకునే అవకాశం కలుగుతుందని...ఒకటా... రెండా... సంవత్సరంపాటు ఎదురుచూసిన పండుగ. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలందరికీ కొత్త ఉత్సాహం ఇస్తున్న పండుగ. ఆధ్యాత్మిక చింతన, నైతిక విలువలు పెంచే పండుగ రంజాన్. ఈ పవిత్రమైన ఈద్ కోసం నెలరోజులపాటు ఉపవాస దీక్షలు చేశారు. బుధవారం నెలవంక కనిపించడంతో అన్నిచోట్లా ఈద్ సందడి కనిపించింది. ముస్లింలు ఆనందోత్సాహాలతో పండుగ ఏర్పాట్లలో మునిగిపోయారు.

- నేడు ఈద్-ఉల్-ఫితర్
- ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాలలో పూర్తయిన ఏర్పాట్లు



కడప నగరంలోని బిల్టప్ ఈద్గా మైదానంలో రంజాన్ ప్రార్థనల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిరి

కడప కల్చరల్/మదనపల్లె సిటీ: రంజాన్ మాసం ప్రారంభం కాగానే ఉపవాస దీక్షలతో, ప్రత్యేక ప్రార్థనలతో ముస్లింలు ఈ మాసం ప్రత్యేకతను నిలిపేందుకు సిద్ధమయ్యారు. తమకు అత్యంత పవిత్రమైన ఈ పండుగను పూర్తి స్థాయిలో భక్తిశ్రద్ధలతో చేసుకునేందుకు ఉపవాసాలతోపాటు ఈ నెలంతా పూర్తిగా ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. పెద్దలు సూచించిన విధంగా మసీదులకు వెళ్లి నమాజులు చేశారు. నెలవంక కనిపించడంతో మసీదుల్లో తరావీ ప్రార్థనలు ముగించారు. ప్రత్యేకంగా విచ్చేసిన గురువుల ఆధ్వర్యంలో సాగిన ఖురాన్ పఠనం పూర్తి చేశారు. ఎదురుచూసిన వరాల వసంతం వచ్చేయడంతో పండుగ నిర్వహణకు సిద్ధమయ్యారు. మసీదు కమిటీల ఆధ్వర్యంలో గురువారం పండుగ ప్రత్యేక ప్రార్థనల నిర్వహణ కోసం తగిన ఏర్పాట్లు చేశారు. మసీదుల వద్ద కంటే ఈద్గాలలో ప్రార్థనలు నిర్వహించేందుకే ఎక్కువ మంది భక్తులు రానున్నారు. కడప వాసులు బిల్టప్ ఈద్గా, ఆలంఖాన్‌పల్లె వద్దగల దండు షాహీ ఈద్గా, జమాల్‌పల్లె, మాచుపల్లె, రిమ్స్ వద్దగల ఈద్గాలలో పండుగ ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇందుకోసం కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. బిల్టప్, దండు ఈద్గాలను ముస్లిం రాజకీయ ప్రముఖులు బుధవారం నాడే పరిశీలించి సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. మైనార్టీశాఖ, కార్పొరేషన్ అధికారులు ఈద్గా మైదానాలను చదును చేసి పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ప్రార్థనలకు వచ్చే వారికి నీడ నివ్వడం కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. నమాజు ప్రార్థనలకు కార్పెట్లను ఏర్పాటు చేస్తున్నారు. వుజూ, తాగేందుకు మంచి నీరు, డస్ట్‌బిన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.



విద్యుత్ వెలుగులతో మదనపల్లెలోని జామియా మసీదు



సమాజ వికాసం.. రంజాన్ పరమార్థం

ఉపవాసం సామాజిక జీవనానికి మూలం. సోదరభావం, సౌభ్రాతృత్వం , దాతృత్వమే పునాదిగా ఉప వాస దీక్ష వెల్లివిరిస్తుంది. రంజాన్‌మాసంలో ప్రతి ముస్లిం ఉపవాసాన్ని పాటిస్తారు. ఎంతటి ఐశ్వర్యవంతుడైనా,కటిక పేదవాడైనా ఉపవాసం వ్రతం ఉండి తీరాల్సిందే. ఈ దీక్షల వలన పేదల ఆకలి బాధను గుర్తిస్తారు. సాటి మానవుని ఆకలి బాధ, కష్టాలు తెలుసుకుని వారిని ఆదుకోవడం, వారి పట్ల దయాగుణాన్ని పెంపొందించుకోవడమే దీక్షల పరమార్థం. దాన,ధర్మాలు చేయటం, ఆర్థిక సహకారం అందించటం తన వంతు బాధ్యతగా భావిస్తారు.

నియమాలు జీవితాంతం పాటించాలి



రంజాన్ ఉపవాసాల ద్వారా నేర్చుకున్న నియమ నిబంధనలు జీవితాంతం పాటించాలి. ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడం ద్వారానే భగవంతుని సులభంగా తెలుసుకోగలం . ఇస్లాం శాంతి సందేశాన్ని ప్రబోధిస్తుంది. అందరినీ అల్లా సన్మార్గంలో నడపాలని ప్రార్థనలు చేద్దాం. -హాఫీజ్ ఇక్బాల్‌సాహెబ్, ప్రభుత్వ సర్‌ఖాజీ, మదనపల్లె

ఏపీ నూతన విద్యా విధానానికి ప్రశంసలు

- ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రా రెడ్డి

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానానికి దేశ వ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఐటీఐ సమీపంలోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, అపుస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పీవీ రమణారెడ్డి, జిల్లా వ్యవస్థాపకులు ఇలియాస్ రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 57 నెలల వైఎస్సార్‌సీపీ పాలనలో నాడు-నేడు ద్వారా రూ.74వేల కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చివేశారన్నారు. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా మౌళిక వసతులు కల్పించారన్నారు. పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారం, షూ, బెల్ట్ వంటివి అందించడం జరుగుతోందన్నారు. ఉపాధ్యాయులకు ఏపీజీఎల్ఐ, పీఎఫ్ రుణాలను 95 శాతం క్లియర్ చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 59 వేలమంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టామన్నారు. 98 డీఎస్సీకి సంబంధించి 4వేలమందికి పోస్టింగులు ఇచ్చారన్నారు. దేశంలో మరే ముఖ్యమంత్రి చేయని విధంగా విద్యాకానుక, వసతి దీవెన, విదేశీ విద్య పథకాలను అమలు చేస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్ని ఇబ్బందులు పడ్డారో ఒకసారి గుర్తెరిగి వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ హెడ్మాస్టర్లపై ప్రభుత్వం ఎలాంటి భారం మోపలేదని, వారైతే పనులను నిజాయితీగా పర్యవేక్షిస్తారనే వారికి అప్పగించడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కూడా రూ.3వేల వేతనం పెంచారన్నారు. ఆరోగ్య భీమా పథకంతో సంరక్షణ కల్పించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నీతిఆయోగ్ ప్రశంసించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలలు నడుపుతున్న యాజమాన్యాల సమస్యల పట్ల కూడా ప్రభుత్వం చాలా సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తోందని, ఉద్యోగ, ఉపాధ్యాయులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలపాలని కోరారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి

జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: ఎన్నికల ప్రచార కార్యకలాపాల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.విజయ్ రామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జేసీ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోదలిచే రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల సంఘం నియమ నిబంధనలను పాటిస్తూ సంబంధిత రిటర్నింగ్ అధికారుల వద్ద అనుమతి పొందాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేశామని, జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా మోడల్ కోడ్ ఉల్లంఘన చర్యలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టడం జరుగుతోందన్నారు. ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ప్రత్యక్ష ఆధారాలతో ఫిర్యాదు చేస్తే.. తప్పకుండా విచారించి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. నాయకుల ర్యాలీలు, స్టార్ క్యాంపెయిన్, రోడ్ షో లాంటి కార్యక్రమాల కోసం 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలన్నారు. డోర్ టూ డోర్ ప్రచారానికి కూడా పర్మిషన్ తప్పక తీసుకోవాలన్నారు. షాడో అబ్జర్వేషన్ కూడా 24/7 నిరంతర నిఘా నిర్వహించడం జరుగుతుందన్నారు. సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్ అంతా పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి.. ఈ నెల 17లోపు అన్ని రకాల ఫారాలకు సంబంధించి అభ్యర్థనలు పరిశీలించి పూర్తి చేస్తామని వివరించారు. ఈవీఎంలు జిల్లాకు సరిపడా మేర సిద్ధంగా ఉన్నాయన్నారు. 12వ తేదీన మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపడతామన్నారు. అలాగే.. ఈ నెల 13, 14వ తేదీల్లో పీవో, ఏపీవోలకు మొదటి విడతలో ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మే 5వ తేదీన ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి రాజకీయ పార్టీలు, పోటీచేసే అభ్యర్థులు, పార్టీ ప్రతినిధులు.. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో ప్రచార ప్రకటనలు, బహిరంగ ప్రచారానికి ఉపయోగించే అనౌన్స్మెంట్, బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు వంటి ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలంటే మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. జిల్లాలో ఎక్కడైనా అధికారులు కానీ, పార్టీల ప్రతినిధులు కానీ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నట్లు మీ దృష్టికి వస్తే సి-విజిల్ యాప్ ద్వారా, లేదా కమాండ్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1950 లేదా కాల్ చేసి తెలిపితే వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.హరిప్రసాద్(టీడీపీ), కానుగ దానం (బీఎస్పీ), జి.లక్ష్మణ్‌రావు (బీజేపీ), బి.పాల్ సుధాకర్ (కాంగ్రెస్), బి. మల్లికార్జున (వైఎస్ఆర్ సిపి), డా.బి శ్రీనివాసులు, ఎం. తిరుమల్ రెడ్డి(ఆప్) మనోహర్ (సీపీఐఎం) తదితరులతోపాటు ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు సర్వం సిద్ధం

- పట్టణంలో కోలాహల వాతావరణం
- బంధువుల రాకతో కళకళలాడుతున్న ఇళ్లు



విద్యుత్ దీపాల అలంకరణలో గంగమ్మ ప్రతిమ

రాజంపేట టౌన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధిగాంచిన బలిజపల్లె గంగమ్మ జాతరకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. బలిజపల్లెలో గురువారం జరిగే జాతరలో పెద్దఎత్తున పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు అధికారుల సూచనల మేరకు నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కాగా ఏటా లక్ష మందికి పైగా భక్తులు జాతరలో పాల్గొంటారు. ఈ ఏడాది టెన్త్, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు ముగియడంతో పాటు రంజాన్ కారణంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు, కార్యాలయాలకు సెలవు కావడంతో గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉంటుందని పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు. జాతర కోసం వివిధ ప్రాంతాల్లో ఉండే భక్తులు రాజంపేటలోని తమ బంధువుల ఇళ్లకు చేరుకున్నారు. దీంతో బుధవారం పట్టణంలో ఎటుచూసినా కోలాహల వాతావరణం కనిపించింది.

ఆకర్షిస్తున్న అమ్మవారి ప్రతిమలు

జాతరను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన గంగమ్మ ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అలాగే బలిజపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. బలిజపల్లె గంగమ్మ పుట్టినిల్లయిన తుమ్మల అగ్రహారంలోనూ విద్యుత్ దీపాల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతరను బలిజపల్లె, తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె గ్రామ ప్రజలు కలిసి నిర్వహించనున్నందున ఆ మూడు గ్రామాల్లో ఎటుచూసినా సందడి వాతావరణం కనిపిస్తోంది. కాగా జాతరకు వచ్చే భక్తులకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు మంచినీళ్లు, మజ్జిగప్యాకెట్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

సాంకేతిక విద్య.. భవితకు భరోసా

- పదో తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం
- పాలిసెట్ దరఖాస్తుకు ముగిసిన గడువు
- ఏప్రిల్ 27న పాలిసెట్ ప్రవేశ పరీక్ష
- కడప పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైన ఉచిత కోచింగ్



కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల




కడప పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న పాలిసెట్ కోచింగ్‌కు హాజరైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి తరువాత వీలైనంత తొందరగా ఉద్యోగం సంపాదించాలనుకునే వారికి పాలిటెక్నిక్ కోర్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. పదవ తరగతి తరువాత ఇంటర్, డిగ్రీ, కోర్సులు చేయడం సాధారణం. అయితే డిగ్రీ పూర్తయ్యి ఉద్యోగం వచ్చేంత సమయం లేకపోవడంతో చాలామంది పాలిటెక్నిక్ కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. పదవ తరగతి విద్యార్థతతో సాంకేతిక విద్యకు పునాది వేసే పాలిసెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసింది. ఈ పరీక్షలలో ఉత్తమ ర్యాంకు సాధించిన వారికి రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ ప్రవేశాలు లభిస్తాయి. ఇటీవలే పదవ తరగతి పరీక్షలు కూడా ముగిశాయి. త్వరలో ఫలితాలను కూడా ప్రభుత్వం విడుదల చేయనుంది. పదవ తరగతి విద్యార్థులంతా పాలిసెట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యావేత్తలు, సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు.

ఉద్యోగ అవకాశాలు మెండు

పదవ తరగతి చదివిన వెంటనే సాంకేతిక విద్య చదవాలనే గ్రామీణ పేద విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు గొప్ప అవకాశం. ఇంజనీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక విద్య అభ్యసించడం ఎక్కువ ఖర్చుతో కూడుకున్నది. పాలిటెక్నిక్‌లో ఏ కోర్సు చేసినా ఉద్యోగం, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి. దీంతో భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం సులభంగా లభిస్తుంది. ఇటీవల వివిధ సంస్థలు నేరుగా కళాశాలలకు వెళ్లి పాలిటెక్నిక్ చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులను తమ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఆయా కళాశాలల్లో జాబ్ మేళాలు కూడా ఏర్పాటు చేస్తూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.



10వ తేదీతో ముగిసిన పాలిసెట్‌కు తుది గడువు

ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు పాలిసెట్ పరీక్ష రాయాల్సిందే. పాలిసెట్ దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 10వ తేదీతో గుడువు ముగిసింది. ఈ నెల 27వ తేదీన పాలిసెట్ ప్రవేశ పరీక్షను కూడా నిర్వహించనున్నారు. ఈ పరీక్షను 120 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో గణితం 50 మార్కులకు, ఫిజిక్స్ 40 మార్కులకు, కెమిస్ట్రీ 30 మార్కులకు ఉంటుంది. పదవ తరగతి సిలబస్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష కోసం కడప, ప్రొద్దుటూరులలో పరీక్షా కేంద్రాలను ఎంపిక చేస్తారు. ఇందుకు సంబంధించిన ఫలితాలు మే నెల 25న విడుదల చేస్తారు. జూన్ నాలుగో వారం నుంచి ప్రవేశాలకు కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తారు.

లభించే కోర్సుల వివరాలు ఇలా...

ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో సివిల్, మెకానికల్ , ట్రిపుల్ ఈఈ, కంప్యూటర్ మెకానిక్, ఈసీఈ, ఎంఈసీలతోపాటు ఒకటి రెండు కొత్త కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సులో ఒక్కో బ్రాంచికి 30 నుంచి 120 వరకు సీట్లు వరకు అందుబాటులో ఉంటాయి. ఉమ్మడి జిల్లా మొత్తంపైన ప్రభుత్వ. ప్రైటు కలిసి 28 పాలిటెక్నిక్ కళాశాలకుగాను 7656 సీట్లు అందుబాటలో ఉన్నాయి.

కడప మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో...

ఈ నెల 27వ తేదీ నిర్వహించనున్న పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా కోచింగ్‌ను అందిస్తున్నారు. ఈ కోచింగ్‌కు కడప నగరంతో పాటు పలు గ్రామీణ ప్రాంతం నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు వస్తున్నారు. వీరికి ఉదయం నుంచి బోధనలను అందిస్తున్నారు. దీంతోపాటు కోచింగ్ కోసం వచ్చిన విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్‌ను కూడా అందించారు.

ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు: **10**

ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు : **18**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులో ఉన్న సీట్లు: **2316**

ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులో ఉన్న సీట్లు: **5340**

ర్యాంకు సాధిస్తాం...



ఈ నెల 27వ తేదీ నిర్వహించే పాలిసెట్‌లో తప్పకుండా ర్యాంకును సాధిస్తాం. మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఇస్తున్న కోచింగ్ నాకు బాగా ఉపయుక్తంగా ఉంది. బాగా చదువుకుంటున్నాను. తప్పకుండా ర్యాంకు సాధిస్తా. - అరుణ్, విద్యార్థి, కోడూరు

చిన్న వయసులోనే ఉద్యోగావకాశాలు



పదో తరగతి తర్వాత తక్కువ ఫీజులతో సాంకేతిక విద్య లభించే కోర్సు పాలిటెక్నిక్. ఈ కోర్సు చేయడం ద్వారా విద్యార్థుల భావి జీవితానికి బంగారు బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది. కళాశాలల్లో నిర్వహించే జాబ్ మేళా, క్యాంపస్ ఇంటర్వ్యూలలో పెద్ద పెద్ద సంస్థలు నైపుణ్యం ఉన్న వారిని ఎంపిక చేసుకుని ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. - సీహెచ్ జ్యోతి, ప్రిన్సిపాల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, కడప

గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి


గండికోటలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : గండికోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. బుధవారం ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి గండికోటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్కియాలజీ అధికారులకు మ్యాపుల ద్వారా గండికోటలో పలు ప్రదేశాలలో అభివృద్ధి గురించి వివరించారు. మాధవరాయ గుడి వద్ద పాత్ వే, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. గండికోటలో సెల్ఫీ పాయింట్స్, ఫొటోషూట్ పాయింట్స్ ఏర్పాటు చేసేందుకు డిజైన్లు సిద్ధం చేయాలని సూచించారు. ప్లాస్టిక్ బాటిల్స్ వంటివి లేకుండా పరిశుభ్రమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. వ్యూ పాయింట్ వద్ద భద్రతాపరమైన చర్యల కోసం రైలింగ్ ఏర్పాటు చేసేందుకు డిజైన్ సిద్ధం చేయాలన్నారు. పబ్లిక్ టాయిలెట్లకు మరమ్మతులు చేయించాలన్నారు. గండికోటలో గ్రీనరీ, సోలార్ పవర్ సిస్టం ఏర్పాటు చేసేందుకు డిజైన్లు సిద్ధం చేయాలన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా ఆర్‌ఓ ప్లాట్లు ఏర్పాటు చేయాలన్నారు.

అనంతరం సాధారణ ఎన్నికలకు సంబంధించి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరులలో స్ట్రాంగ్ రూములు, అధికారులకు ఇచ్చే ట్రైనింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూముల్లో లైటింగ్, సీసీ కెమెరాలు, నైట్ విజన్ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సామగ్రిని భద్రపరిచే ఐరన్ ర్యాక్స్‌ను సిద్ధం చేయాలని, స్ట్రాంగ్ రూములు ఉన్న సెంటర్ల వద్ద భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి ప్రతి మెటీరియల్ పెన్ డ్రైవ్‌లో పొందుపరచాలని, డిజిటల్ బోర్డు ద్వారా ఎన్నికల విధానంపై ట్రైనింగ్ ఇవ్వాలని ఆదేశించారు. ట్రైనింగ్ జరిగే విధానాన్ని వీడియో రూపంలో చిత్రీకరించి పెన్ డ్రైవ్స్‌లో పొందుపరచాలన్నారు. ట్రైనింగ్ కోసం వచ్చిన అధికారులకు కావలసిన వసతులు, భోజనం ఏర్పాటు చేయాలన్నారు. ట్రైనింగ్ సెంటర్లలో టాయిలెట్లను పరిశీలించిన ఆయనే వాటిని శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఉగాది 'చల్ల' పంపిణీ


ముద్దనూరులో చల్ల పంపిణీకి హాజరైన ప్రజలు

ముద్దనూరు : స్థానిక రామాలయం వీధిలో బుధవారం చల్ల పంపిణీ చేశారు. ప్రతి ఏడాది ఉగాది పర్వదినం మరుసటి రోజున రామాలయం వీధిలోని కరణమయ్య ఇంటి సమీపంలో చల్ల పోయడం సంప్రదాయంగా కొనసాగుతోంది. ఉదయం భారీ సంఖ్యలో చల్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఖైదీలతో ములాఖత్ వేళల్లో మార్పు

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలోని ఖైదీలకు ఇచ్చే 'ములాఖత్' (ఇంటర్వ్యూ)ల వేళలను మార్పు చేసినట్లు కడప కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్ జవహర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎండతీవ్రత, తీవ్ర వడగాల్పుల కారణంగా ఇంటర్వ్యూలకు వచ్చే సందర్శకులకు వడదెబ్బ తగలకుండా ఎండ తీవ్రత తగ్గుముఖం పట్టేవరకు రాష్ట్ర జైళ్ల శాఖ ప్రధాన కార్యాలయం ఉత్తర్వుల మేరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే ములాఖత్‌లు ఉంటాయని పేర్కొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ముద్దనూరు : ఈనెల 4వతేదీన మండలంలోని చౌటిపల్లె పునరావాస కేంద్రం సమీపంలో ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్వర్లు(47)అనే వ్యక్తి బుధవారం మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన వెంకటేశ్వర్లు అరటిపండ్ల వ్యాపారం చేసేవాడు. ఈ నెల 4 వతేదీన ముద్దనూరులోని కొత్తకొట్టాల వీధిలో ఉండే తన భార్య వద్దకు తాడిపత్రి నుంచి మోటార్‌బైక్‌లో ప్రయాణిస్తున్నాడు. చౌటిపల్లె సమీపంలో గుర్తుతెలియని వాహనం బైకును ఢీకొట్టి వెళ్లింది. క్షతగాత్రుడైన వెంకటేశ్వర్లును 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

పోలీసుల అదుపులో ఈవ్‌టీజర్స్

కడప అర్బన్: కడప నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో బుధవారం రాత్రి కొంతమంది యువకులు గంజాయిని సేవించి ఆ మత్తులో బలాదూర్ తిరిగారు. మార్గమధ్యంలో ఓ యువతిని ఈవ్‌టీజింగ్ చేస్తూ, తమ వికృత చేష్టలతో భయభ్రాంతులకు గురిచేశారు. వీరిలో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. మరి కొంతమంది పరారయ్యారు.

ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : గుర్రంకొండ మండలం గరికుంటపల్లెకు చెందిన ఆనంద్ భార్య కె.మాధవి(28) కుటుంబ సమస్యలతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. అదేవిధంగా గుర్రంకొండకు చెందిన బాబు భార్య సి.జ్యోతి(30) కుటుంబ సమస్యలతో విషపు గుళికలు మింగింది.

అమ్మకు ఆశ్రయం కల్పించిన సేవాశ్రమం


వృద్ధురాలిని ఆశ్రమానికి తీసుకెళుతున్న రామకృష్ణారెడ్డి

కాశినాయన : నవమాసాలు మోసి కన్న తల్లి చివరకు కొడుకుకు బరువైంది. ఆ తల్లికి వృద్ధాప్యంలో పిడికెడు మెతుకులు పెట్టలేక రోడ్డు మీద వదిలేశాడు ఓ ప్రబుద్ధుడు. వివరాల్లోకి వెళితే మూడు రోజుల క్రితం కడప నుంచి ఓ వ్యక్తి తన తల్లిని ఆటోలో తీసుకువచ్చి జ్యోతిలో వదిలేశాడు. అమ్మా ఇక్కడే ఉండు, మళ్లీ వస్తానని చెప్పి పత్తా లేకుండా పోయాడు. ఈ క్రమంలో వివేకానంద సేవాశ్రమం నిర్వాహకులు రామకృష్ణారెడ్డి జ్యోతిక్షేత్రానికి వెళ్లారు. అక్కడ సిమెంటు దిమ్మెపై పడుకుని ఉన్న వృద్ధురాలిని పలుకరించారు. అవ్వా ఏ ఊరు మీది అని అడిగితే మాది కడప అని, తన కొడుకు మళ్లీ వస్తానని చెప్పి ఇక్కడే ఉండమని చెప్పాడు అని కన్నీళ్లు పెట్టుకుంది. నడవలేని స్థితిలో ఉన్న ఆమెను రామకృష్ణారెడ్డి ఓదార్చి ఆశ్రమానికి తీసుకువచ్చారు. వైద్యపరీక్షలు నిర్వహించి అక్కున చేర్చుకున్నారు. 'నా కొడుకు వదిలేసి పోయాడు' అని కంటతడి పెట్టి మాట్లాడుతుంటే అక్కడ ఉన్న వారు చలించిపోయారు. నడుము వంగి నడవలేక ఉన్న ఆమెను రామకృష్ణారెడ్డి ఆశ్రమానికి చేర్చి ఆదుకున్నారు.

షాపింగ్ మాల్స్‌లో చిన్న పిల్లలతో పనులు చేయించడం నేరం



షాపింగ్ మాల్స్‌లో అవగాహన కల్పిస్తున్న లేబర్, పోలీస్, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు

కడప అర్బన్ : షాపింగ్ మాల్స్ యజమానులు చిన్న పిల్లలతో పనులు చేయించుకోరాదని, అలా చేస్తే చట్టరీత్యానేరమని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. మనోహర్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత సూచనల మేరకు నిర్బంధిత కార్మికుల రక్షణ, పునరావాస కార్యక్రమాలకు సంబంధించి బుధవారం కడప నగరంలోని ట్రంక్‌రోడ్, మునిరాజ్ స్ట్రీట్, చెన్నూరు బస్టాండ్ సర్కిల్‌లలో ఉన్న షాపులలో లేబర్ డిపార్ట్‌మెంట్, పోలీస్ అధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు రెస్క్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాపు యజమానులు చిన్నపిల్లలతో పనులు చేయించుకోరాదన్నారు. వయసు ధ్రువీకరణ పత్రాలు తీసుకుని షాపులలో పనిచేయించుకోవాలన్నారు. ఉచిత న్యాయ సహాయం మొదలగు అంశాలను వివరించారు. కార్మికశాఖ అధికారులు జి. శ్రీనివాసరెడ్డి, కె.మునిస్వామి, దిశా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నిర్మలాదేవి, షాపు యజమానులు పాల్గొన్నారు.

కారు–మోటార్ బైకు ఢీ

– ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన యువకులు

ముద్దనూరు : ముద్దనూరు–కడప ప్రధాన రహదారిలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న కారు, మోటార్ బైకు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు సింహాద్రిపురానికి చెందిన శశిధర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి అనే యువకులు మోటార్ బైకుపై ఎర్రగుంట్ల వైపు ప్రయాణిస్తున్నారు. మోటార్‌బైకును సబ్‌స్టేషన్ వద్ద కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. ఇందులో ఒకరు అపస్మారక స్థితిలో ఉన్నారు. తొండూరు 108 వాహనంలో క్షతగాత్రులిద్దరినీ ప్రొద్దుటూరుకు తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి సీఐ వివరాలు సేకరించారు.

ముస్లింల ఓట్లను చీల్చేందుకు కుట్ర

వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్



కడప కార్పొరేషన్ : ప్రస్తుత ఎన్నికల్లో ముస్లింల ఓట్లను చీల్చేందుకు కొందరు ముస్లిం నేతలే కుట్ర పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్న ముస్లింల ఓట్లు చీల్చేందుకు టీడీపీ ముసుగులో ఉన్న కొందరు ముస్లిం నేతలు చంద్రబాబు, జగన్ ఇద్దరూ బీజేపీ మద్దతుదారులేనని, వారికి కాకుండా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రచారం చేయడం దారుణమన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు నరేంద్రమోడీ, అమిత్ షాలను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిన చంద్రబాబు, ఎన్నికల సమయంలో మోడీ కాళ్లు పట్టుకొని బీజేపీతో పొత్తు పెట్టుకున్నారన్నారు. తెలంగాణలో పార్టీ పెట్టి కాంగ్రెస్‌పార్టీని, రేవంత్ రెడ్డిని ఇష్టం వచ్చినట్లు విమర్శించిన షర్మిల, చంద్రబాబుకు సాయం చేయడానికే పీసీసీ అధ్యక్షురాలిగా ఏపీకి వచ్చి విమర్శలు చేస్తున్నారన్నారు. టీడీపీతో కాంగ్రెస్‌కు అనైతిక పొత్తు ఉందన్నది నూటికి నూరు శాతం వాస్తవమన్నారు. వై.యస్. జగన్‌మోహన్ రెడ్డి 2014లోగానీ, 2024లోగానీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టు కోలేదన్నారు. ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రాష్ట్ర అవసరాల కోసం కలిసి పని చేస్తామని వైఎస్ జగన్ స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు.

ముస్లింలు గతంలో జరిగిన కొన్ని విషయాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలోనే బాబ్రీ మసీదును కూలగొట్టారని చెప్పారు. కలిసి ఉన్న తెలుగువారిని రెండు రాష్ట్రాలుగా విభజించింది కూడా కాంగ్రెస్సేనని తెలిపారు. ముస్లింలకు ఏదైనా మంచి జరిగిందంటే అది దివంగత వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనేనని తెలిపారు. తండ్రి ఆశయ సాధన కోసం రాజకీయాల్లో వచ్చిన వైఎస్ జగన్ నాలుగు అడుగులు ముందుకేసి, 2019లో ఐదుగురు ముస్లిం అభ్యర్థులకు టికెట్లు ఇచ్చారని, 2024లో ఏడుగురికి టికెట్లు ఇచ్చారని గుర్తు చేశారు. ముస్లింలు రాజకీయంగా ఆర్థికంగా బలపడేందుకు, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

అందరి సహకారంతోనే ప్రశాంత ఎన్నికలు


పెద్దతిప్పసముద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌మకల్

పెద్దతిప్పసముద్రం : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను అందరి సహకారంతో ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపడుతున్నామని అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పరిధిలో 12 అంతర్‌రాష్ట్ర, 3 అంతర్ జిల్లా, 3 ఎస్ఈబీ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఎవరైనా డబ్బు, వస్తువులు, మద్యం రవాణా చేస్తుంటే అలాంటి వాటిని అరికట్టేందుకు చెక్‌పోస్టు సిబ్బందికి కఠినమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లా పరిధిలో ఇప్పటి వరకు పలు చోట్ల చేపట్టిన పోలీసు తనిఖీల్లో 54 కేసులకు సంబంధించి రూ.1.03 కోట్ల నగదును సీజ్ చేశామన్నారు. గ్రామాల్లో గొడవలకు ప్రేరేపించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్ఐ రవీంద్రబాబును ఆదేశించారు. అనంతరం ఆయన ట్రైనీ డీఎస్పీ ఎస్‌జే ప్రశాంత్‌తో కలసి సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు.

పార్టీ క్యాడర్‌ను పట్టించుకోని జయచంద్రారెడ్డి

తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్


ఆలయంలో పూజలు చేస్తున్న శంకర్

పెద్దతిప్పసముద్రం : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయచంద్రారెడ్డి పార్టీ క్యాడర్‌ను కలుపుకొని పోవడం లేదని మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ ఆరోపించారు. బుధవారం ఆయన మండలంలోని టి.సదుం సమీపంలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన సంఘమేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం వందలాది మంది మద్దతుదారులతో నవాబుకోట పంచాయతీలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో పాటు కష్టకాలంలో పార్టీని ముందుకు నడిపానన్నారు. అయితే నియోజకవర్గ ప్రజలకు కనీస ముఖ పరిచయం లేని వ్యక్తికి టీడీపీ టికెట్ ఇవ్వడాన్ని తెలుగు తమ్ముళ్లు ఎవరూ హర్షించడం లేదన్నారు. ఈ నెల 18లోపు తనకు అధిష్టానం నుంచి తనకు ఆహ్వానం అందకపోతే మద్దతుదారులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి వారి అభీష్టం మేరకు సరైన నిర్ణయం తీసుకుంటానని శంకర్ స్పష్టం చేశారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



బి.వెంకట్ (ఫైల్)

కలికిరి : బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి బి.వెంకట్(21) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఆర్.ఎస్.రోడ్డులో నివాసం ఉంటున్న శ్రీనివాసులు, నాగరాణి దంపతుల కుమారుడు బి.వెంకట్(21) చిత్తూరు ఎస్వీసెట్ కళాశాలలో బీటెక్ మూడవ ఏడాది చదువుతున్నాడు. యథావిధిగా బుధవారం ఉదయం కళాశాలకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి వచ్చిన అతను మిద్దెపైన గదిలోకి వెళ్లాడు. ఎంతసేపటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేళాడుతూ కనిపించాడు. హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ఆర్.మోహన్ తెలిపారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని మహిళ మృతి

మదనపల్లె : కుళ్లిపోయిన స్థితిలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం మదనపల్లె మండలం దండువారిపల్లె సమీపంలో బుధవారం వెలుగు చూసింది. వ్యవసాయ పొలంలో పనిచేసేందుకు వెళ్లిన ఓ మహిళా కూలీ దుర్వాసనను గమనించి, స్థానికులకు సమాచారం చేరవేసింది. వారు అక్కడకు వెళ్లి చూడగా, కుళ్లిన స్థితిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. దీంతో తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తరలించేందుకు వీలుకాకపోవడంతో అక్కడికక్కడే వీఆర్వో సమక్షంలో పంచనామా నిర్వహించారు. గత పది రోజులుగా గుర్తు తెలియని, మతిస్థిమితం లేని ఓ మహిళ...కొత్తపల్లె, రామాపురం గ్రామాల్లో భిక్షాటన చేస్తుండేదని స్థానికులు తెలిపారు. మహిళ వయస్సు సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని చెప్పారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు.

గాయపడిన వృద్ధుడి మృతి


మృతి చెందిన వెంకటరమణారెడ్డి

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. బి. కొత్తకోట మండలం భూదలవారిపల్లెకు చెందిన పూల వెంకటరమణారెడ్డి (82), మదనపల్లి పట్టణంలోని సప్తగిరి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఏప్రిల్ 2న వ్యక్తిగత పనులపై ఇంటి నుంచి నడుచుకుంటూ కదిరి రోడ్డుపై వస్తుండగా, సంగం ఫంక్షన్ హాల్ సమీపంలో వెనకవైపు నుంచి వచ్చిన వాటర్ ట్యాంక్లు రవాణా చేస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణారెడ్డి తీవ్రంగా గాయపడగా స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. అక్కడ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు.



నిఘా..నిక్కచ్చిగా!

రాయచోటి : ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయడంలో ఎంసీఎంసీ(మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) కీలక పాత్ర పోషిస్తోంది. 24 గంటలపాటు అందుబాటులో ఉండి ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో వచ్చే వార్తలు, ప్రకటనలు, ఇతర అంశాలపై పరిశీలన చేస్తోంది. మార్చి 16 నుంచి ఇప్పటి వరకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులపై ఎన్నికల సంఘానికి 65 ఫిర్యాదులు చేసి రికార్డు సృష్టించింది.

ఎంసీఎంసీ స్వరూపం..

కలెక్టరేట్‌లోని ఓ కార్యాలయంలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) పని చేస్తుంది. అక్కడ వివిధ దిన పత్రికలు, న్యూస్ చానళ్లు, సోషల్ మీడియాల్లో వచ్చే వార్తలు, ప్రకటనలు, ఇతర అంశాలపై నిఘా పెడుతుంది. కమిటీకి చైర్‌పర్సన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. సెక్రటరీ ఐఅండ్‌పీఆర్ ఏడీ, సభ్యులుగా డీఆర్వో, బీసీ వెల్ఫేర్ అధికారి, సైబర్ సెల్ సీఐ, ఇండిపెండెంట్ అధికారిగా ఎండోమెంట్ ప్రోగ్రామ్ అధికారి ఉన్నారు. ఒక షిఫ్టుకు ముగ్గురు చొప్పున వారి సిబ్బందితో కలిసి మూడు షిఫ్టులుగా విభజించుకుని సిబ్బంది 24 గంటల పాటు పని చేస్తారు.

ప్రింట్, మీడియా, సోషల్ మీడియాపై ఫోకస్..

కేంద్ర ఎన్నికల సంఘం పెయిడ్ న్యూస్‌ను నివారించేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అభ్యర్థులు తమకు ఓటు వేయాలని కోరుతూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇతర ఖాతాల ద్వారా చేసుకునే ప్రచారంపై దృష్టి సారించారు. ముందుగా ఎంసీఎంసీ అనుమతి తీసుకుని ప్రచారం చేసుకోవాలి. లేదంటే వాటిని ప్రచారం చేయకుండా నిలుపుదల చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే ప్రకటనలు, స్క్రోలింగ్ రూపంలో వచ్చే వార్తలపై కూడా దృష్టి సారించింది. రేడియో, సినిమా హాళ్లలో ప్రచారం, ఈ పేపర్లు, ప్రచార రథాలు, కేబుల్ టీవీల్లో స్క్రోలింగ్‌ల ద్వారా ప్రచారం చేసుకోవాలంటే ముందుగా ఎంసీఎంసీ అనుమతి తీసుకోవాలి. అనుమతి తీసుకుని ప్రచారం నిర్వహిస్తే వాటి విలువ అభ్యర్థుల ఖర్చులో జమ రాస్తారు. ఈ క్రమంలో ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో అనుమతి లేకుండా ఎడాపెడా ప్రకటనలు, స్క్రోలింగ్, బల్క్ ఎస్ఎంఎస్, ఇతర రూపాల్లో ప్రచారం చేసుకుంటే ఎంసీఎంసీ గుర్తించి వాటి విలువను లెక్కించి సంబంధిత అభ్యర్థులు లేదా పార్టీల ఖర్చుల ఖాతాల్లో రాసేస్తారు. ఒక విధంగా చెప్పాలంటే పెయిడ్ న్యూస్ కింద పరిగణిస్తారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే వ్యక్తి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. అంతకంటే ఎక్కువ ఖర్చు చేసి గెలిచినా వారి సభ్యత్వాలను రద్దు చేసే అవకాశం కేంద్ర ఎన్నికల సంఘానికి ఉంటుంది. కాగా ఇప్పటి వరకు నిబంధనలు ఉల్లంఘించిన రాజకీయ పార్టీలు, అభ్యర్థులపై ఈ కమిటీ ఎన్నికల సంఘానికి 65 ఫిర్యాదులు చేసింది.

పోస్టర్లు, హోర్డింగ్‌లకు అనుమతి తప్పనిసరి..

అభ్యర్థులు ఓటర్లకు దగ్గర కావడానికి ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తుల్లో ఎలాంటి పరిస్థితుల్లో పోస్టర్లు, హోర్డింగ్‌లు పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వరు. ఇక ప్రైవేటు స్థలంలో వాటిని ఏర్పాటు చేసుకోవాలంటే ముందుగా సంబంధిత యజమాని ఎంసీ ఎంసీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

నెరవేరిన సొంతింటి కల



నాకు ఇప్పటి వరకు సొంతిల్లు లేదు. ఇంటి కోసం గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. నవరత్నాల్లో భాగంగా జగనన్న ప్రభుత్వం ఇల్లు లేని వారికి ఇల్లు మంజూరు చేయడంతో వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నాము. ఎట్టకేలకు మా సొంతింటి కల నెరవేరింది. మా పిల్లలకు అమ్మ ఒడితో పాటు జగనన్న సురక్ష ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా తీసుకున్నాము. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి వలంటీర్ ద్వారానే సంక్షేమ పథకాలు అందిస్తుండటం ఎంతో మేలుగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– కోవెలకుంట్ల వరలక్ష్మి, కాలువపల్లె, గోపవరం మండలం

పాఠశాలల రూపురేఖలు మారాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. మన బడి నాడు–నేడు కార్యక్రమంతో పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు ఎన్నో అదనపు సౌకర్యాలు సమకూరాయి. నేను పనిచేస్తున్న మైదుకూరులోని సాయినాథపురం ప్రాథమిక పాఠశాల గతంలో తరగతి గదిలో కనీసం డెస్కులు కూడా ఉండేవి కావు. ప్రస్తుతం అదనపు తరగతి గదులతోపాటు మరుగుదొడ్లు, దృశ్యశ్రవణ పద్ధతిలో పాఠాలు చెప్పేందుకు టీవీ, పిల్లలకు డబుల్ డెస్కులు వంటివి సమకూరాయి. పాఠశాల చూసేందుకు ఎంతో అందంగా కనబడుతోంది. పిల్లలకు ఆహ్లాదకరమైన తరగతి గదులు ఉండటంతో ప్రైవేటు పాఠశాలల కంటే దీటుగా ఇక్కడ పిల్లలు చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మన బడి నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు అందంగా ముస్తాబయ్యాయి.

– ఎం.లక్ష్మీదేవి, హెడ్ టీచర్, సాయినాథపురం ప్రాథమిక పాఠశాల, మైదుకూరు.

బత్యాలనా..బాలునా!

రాజంపేట : రాజంపేట తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విషయంపై ఇంకా సందిగ్ధం నెలకొనే ఉంది. బుధవారం రాజంపేటలో పోటీపోటాగా టీడీపీ ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడు, అధిష్టానం ప్రకటించిన అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్యాల మీడియాతో మాట్లాడుతూ ఐవీఆర్ సర్వేలో అత్యధికంగా ప్రజల మద్దతు తనకే ఉందన్నారు. చంద్రబాబు తనకు టికెట్ ఇస్తే విజయం సాధిస్తానంటూ చెప్పుకొచ్చారు. రాజంపేటలో టీడీపీ తరపున ఇద్దరు నేతలు ప్రచారం చేస్తుండటంతో పార్టీ శ్రేణులు తర్జన భర్జన పడుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడి, స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చౌడేపల్లె మండలం అనుప్పల్లెకు చెందిన జె.శ్రీరాములురెడ్డి(73) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చి తిరిగి వెళుతుండగా, బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా ప్రొద్దుటూరు మండలం నడింపల్లెకు చెందిన నాగప్ప కుమారుడు వీరాంజనేయులు(28) సొంత పనులపై మదనపల్లె టమాటా మార్కెట్‌కు వచ్చాడు. టమాటా మార్కెట్ వెనుక వైపున నిల్చుని ఉండగా, వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

టీడీపీలో ఐవీఆర్ఎస్ రగడ

మదనపల్లె : టీడీపీలో ఐవీఆర్ఎస్ రగడ మొదలైంది. అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గంలోని ప్రజల ఫోన్లకు బుధవారం మదనపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మీరు ఎవరిని కోరుకుంటున్నారు.? జయరామనాయుడు అయితే..1 నొక్కండి.. నోటా అయితే రెండు నొక్కండి అంటూ.. రెండు వేర్వేరు నంబర్ల నుంచి ఫోన్లు వచ్చాయి. దీంతో ఇప్పటివరకు మదనపల్లె టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషానే అనుకుంటున్న తమ్ముళ్లు సందిగ్ధంలో పడ్డారు. కమ్మ సామాజికవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు జయరామనాయుడు పేరుపై ఐవీఆర్ఎస్ ప్రజాభిప్రాయ సేకరణ జరపడంతో షాజహాన్ బాషాను మార్చేస్తున్నారన్న ప్రచారం పట్టణంలో ఊపందుకుంది.